

బాధితునికి సాయం అందేలా కృషి

ప్రజాశక్తి -హుకుంపేట:వరి కుప్పలు దగ్ధమైన శుక్రన్న కుటుంబానికి ఉన్నతాధికారులతో మాట్లాడి సహాయం అందించేలా చూస్తానని హుకుంపేట జెడ్పిటిసి రేగం మత్స్యలింగం అన్నారు. మండలలోని ఓల్డా పంచాయతీ నిమ్మలపాడు గ్రామంలో సీదరి సుక్రన్న వరి కుప్పలు ప్రమాద వశాత్తూ దగ్ధమైన విషయం తెలుసుకున్న జడ్పిటిసి శుక్రవారం సంఘటన స్థలాన్ని సందర్శించారు. వరి కుప్పలు దగ్ధం కావడంతో శుక్రన్న కుటుంబం రోడ్డున పడిందన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కుటుంబానికి ఆదుకునేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సింహాచలం, ఎంపిటిసి కొర్రాబు వేంకటనాగలక్ష్మి, ఆర్ఐ రంగారావు, వ్యవసాయ శాఖా అధికారి పాల్గొన్నారు.



దగ్ధమైన వరి కుప్పలు పరిశీలిస్తున్న జెడ్పిటిసి

సంతల్లో రేషన్ బియ్యం విక్రయంపై నిఘా

▶▶ పట్టుబడితే కఠిన చర్యలు ▶▶ వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలి ▶▶ జెసి శివ శ్రీనివాసు

ప్రజాశక్తి-పాడేరు: అన్ని సంతలలో నిఘా వేస్తామని రేషన్ బియ్యాన్ని అమ్మితే లబ్దిదారుల కార్డుల రద్దు చేస్తామని సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాసు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో జెసి మాట్లాడుతూ, విద్యార్థులు గ్రామాలలో వినియోగదారుల క్లబ్బులను ఏర్పాటు చేసుకొని వస్తువుల నాణ్యతను పరిశీలించాలన్నారు. వినియోగదారుల చట్టంలో వినియోగదారుల హక్కుల తో పాటు, తయారీదారుల బాధ్యతలు కూడా ఉన్నాయని, చట్ట ప్రకారం మోసపూరిత ప్రకటనలు, తప్పుడు కొలతలు, వివరాలు ప్రకటిస్తే శిక్షార్హులవుతారని వివరించారు. రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం కిలో రూపాయికే బియ్యం, కందిపప్పు కిలో రూ.67లు, పంచదార కిలో రూ. 17లు అమ్ముతుందని, వాటిని అధిక ధరకు లేదా తక్కువ బరువుకు అమ్మితే వారు కూడా శిక్షార్హులవుతారని తెలిపారు. కొంతమంది రేషన్ షాపు వినియోగదారులు కిలో రూపాయి చొప్పున బియ్యం కొని బయట వ్యక్తులకు అమ్ముతున్నారని, ఇది నేరమేనని జెసి. చెప్పారు. ఈ విషయంలో విద్యార్థులు తల్లిదండ్రులను చైతన్య పర్చాలన్నారు. ముఖ్యంగా రేషన్ షాపులలో లభించే బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కలుస్తుందని, అది అత్యంత బలవర్ధకమైనందున ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యాన్ని వినియోగించు కోవాలన్నారు.

వస్తువులు పరిశీలించాలి :పిఒ

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ, వస్తువులు కొనేముందు నాణ్యత, బరువు, ధర, బ్రాండ్ తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.ఆరోగ్య భద్రత సూచికలు, మార్కింగులు లేబిల్ పరిశీలించి మాత్రమే కొనుగోలు చేయాలని, లేకుంటే వినియోగదారుడు మోసపోయే అవకాశం ఉంటుందని వివరించారు.సంతలలో నాణ్యత లేని వస్తువులు, నిలువ సరుకులు, మోసపూరిత వస్తువులు అమ్మే అవకాశం ఉన్నందున జాగ్రతగా పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువు రసీదు, బిల్లు పొందాలని తెలిపారు. ఆ వస్తువు నాణ్యతలో లేదా ఉంటె వెంటనే షాపు వారికి, లేదా వినియోగారుల ఫోరంకు ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.

సబ్ కలెక్టరు వి.అభిషేఖ్ మాట్లాడుతూ ఏ చిన్న వస్తువు కొనుగోలు చేసినా రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రసీదులో పూర్తి వివరాలు ఉండాలని లేకుంటే రశీదు చెల్లదని, దాని ఆధారంగా ఫిర్యాదు చేయలేమని తెలిపారు. వస్తువు తయారి తేది, ముగింపు ఉంటాయని, వాటిని కూడా గుర్తించాలని సూచించారు. వినియోగదారుల హక్కుల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శివ ప్రసాద్, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ గణేష్ కుమార్, జిల్లా వైద్య శాఖాధికారి జమాల్ భాష, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, జిల్లా ఆహార భద్రత అధికారి వేణుగోపాల్, లీగల్ మెట్రాలజి అధికారి అనురాధ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి, జిల్లా వినియోగదారుల స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నానిబాబు పాత్రుడు, మండల వినియోగదారుల సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి శివ శ్రీనివాసు



సమావేశంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సిపిఎం ప్రజాప్రతినిధులు

వరద బాధితులకు పరిహారం చెల్లించాలి

మండల పరిషత్తు సమావేశంలో ప్లకార్డులతో నిరసన

ప్రజాశక్తి-కూనవరం

ఈ ఏడాది గోదావరి వరదలు కారణంగా తీవ్రంగా నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు పరిహారం చెల్లించాలని వైస్ ఎంపిపి డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశం జరుగుతుండగా సిపిఎం ప్రజాప్రతినిధులు ప్లకార్డులు పట్టుకుని వరద బాధితులకు న్యాయం చేయాలలని నిరసన తెలిపారు. సమావేశ మందిరం బయట సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేసి ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి పెంటయ్య మాట్లాడుతూ గోదావరి వరదలకు మండలంలోని అన్ని గ్రామాలు నష్ట పోయాయని, ఆ రోజు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి ప్రతి కుటుంబానికి రూ.10వేలు చొప్పున పరిహారం ఇస్తామని చెప్పారని, ఆరు నెలలైనా నేటికీ చెల్లించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, తాళ్లూరి శ్రీను, సీనియర్ నాయకులు నాగరాజు, సిపిఎం ఎంపిటిసిలు కారం జయసుధ, అమ్మాజీ, వెంకమ్మ శంకర్, నాగమణి, జక్కుల వీరబాబు, జనసేన ఎంపిటిసి సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఎవరి కోసం?

మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-హుకుంపేట:చింతపల్లి, కొయ్యూరు మండలాల సరిహద్దు ప్రాంతమైన గిందిపాకల పంచాయితి సమగిరి, ఎర్రవరం సమీప అటవీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఎవరి కోసం అని, గిరిజన గ్రామాలను ముంచడానికా, వైసిపి వ్యాపారం కోసమా అని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి కిడారి శ్రావణ్ కుమార్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో శుక్రవారం మీడియా సమావేశంలో కిడారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అడవిని నమ్ముకుని ఏళ్ల తరబడి జీవిస్తున్న గిరిజనులను అడవి నుండి వెళ్లగొట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని ఆయన ధ్వజమెత్తారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో బాక్సైట్ తవ్వకాలను రద్దు చేశామన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా గిరిజన ప్రాంతంలో కార్పొరేట్ కంపెనీలు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడం సరికాదని ఆయన అన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణంతో 32 గ్రామాల ప్రజలు, సుమారుగా 6000 మంది జనాభా అన్యాయంగా నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. గిరిజన ప్రాంతంలో మచ్ఖండ్, సిలేరులో పవర్ ప్రాజెక్ట్ లు ఉన్నపటికీ గిరిజన ప్రాంతంలో ఉచిత ఉద్యుత్ ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సిరగాం సూర్యాకాంతం, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు, టీడిపి సీనియర్ నాయకులు శెట్టి లక్ష్మణుడు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకురు వెంకటరమణరాజు, దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, అరకు పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు తామర్ల సత్యనారాయణ, స్థానిక ఎంపీటీసీ కొమ్మ రమ, మండల తెలుగు యువత అధ్యక్షుడు పల్టాసింగి కామేశ్వరరావు, అరకు అసెంబ్లీ తెలుగు యువత ఆర్గనైజర్ సెక్రటరీ అచ్చిబాబు, వార్డు మెంబర్ వెంకట్, కొర్ర నాగబాబు, టీడిపి యువ నాయకులు తాంగుల మహేష్, శివ సాగర్, త్రినాథ్, మహేష్, రాజు, మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్



ప్రారంభిస్తున్న సర్పంచ్

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలో సొలభం పంచాయతీ కేంద్రంలో జడ్పిటిసి నిధులతో నిర్మించిన తాగునీటి బోరును స్థానిక సర్పంచ్ హనుమంతరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్తులు ఈ బోరును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం.గంగరాజు, వార్డు మెంబర్లు, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చలిమంట కాగుతున్న చిన్నారులు, యువకులు

వణికిస్తున్న చలి

ప్రజాశక్తి -సీలేరు

జీకే మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా చలి తీవ్రత అధికమైంది. స్థానికులు చలికి గజగజ వణికిపోతున్నారు. కొన్నాళ్లుగా మంచు కమ్మేస్తుంగా, ప్రస్తుతం కొద్దిపాటి తగ్గుముఖం పట్టింది. గాలిలో తేమ అధిక శాతం ఉండడంతో ఉదయం ఎనిమిది గంటల వరకు చలి తీవ్రతకు తాళలేక రోడ్లపై జనాలు సంచరించడం లేదు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి చల్లటి గాలులు వీస్తూ చలి తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో వ్యాపారులు రాత్రి 8 గంటలకే దుకాణాలు మూసి వేస్తున్నారు. చలికి తాళలేక ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి పురవీధుల్లో చలి మంటలు వేసుకొని కాగుతూ ఉపశమనం పొందుతున్నారు. సీలేరు నది పరివాహక ప్రాంతంలో ఉన్న చింతపల్లి క్యాంప్, చంద్రుపల్లి లైకాన్ గిరిజనులు చలికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి, తెల్లవారుజామున సీలేరు నుంచి బస్సులో ప్రయాణించే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. జికె.వీధి మండలం దుప్పిలి వాడ, దారకొండ పంచాయతీల్లో చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. సంక్రాంతి సమీపిస్తుండడంతో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.



ట్యాబ్‌లను ఇస్తున్న ప్రజాప్రతినిధులు

ట్యాబ్‌లతో సాంకేతిక పరిజ్ఞానం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించుకునే దిశగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేస్తున్నారని ఎంపీపీ బాకా ఈశ్వరి, జడ్పిటిసి జానకమ్మలు చెప్పారు. కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి వి.త్రినాధరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించారని, సాంకేతిక విద్యా ప్రమాణాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు.మండలంలోని పది ఆశ్రమ పాఠశాలలో 756 మంది విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, వైస్ సర్పంచులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చవివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు. మండల కేంద్రంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. మండలంలో 3063 మంది విద్యార్థులకు ట్యాబ్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ1 సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారి చెల్లయ్య, వైసీపీ మండల అధ్యక్షులు పాంగి మల్లికార్జునరావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు మాణిక్యాలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ త్రినాథ్

త్వరలోనే జల్ జీవన్ మిషన్ పనులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో త్వరలోనే జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభం అవుతాయని, గిరిజనులు కాంట్రాక్టర్‌కు సహకరించాలని లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ కోరారు. శుక్రవారం లక్ష్మీపురంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో 19 గ్రామాలు కలిగి ఉన్నప్పటికీ వీటిలో 3 గ్రామాలకు తప్ప మిగతా 16 గ్రామాలలో తాగునీటి సమస్య చాలా తీవ్రతంగా ఉందని తెలిపారు.తాగునీటి సమస్యపై స్పందనలో వినతిపత్రం అందించడంతో ఫలితంగా జిల్లా కలెక్టర్ స్పందించి జల్ జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఐఎస్ఎ సంస్థ కో ఆర్డినేటర్ పూజారి మహేశ్వరరావు, చంటిబాబు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024 నాటికి గ్రామాల్లోని, ప్రతి కుటుంబానికీ స్వచ్ఛమైన మంచి నీరు అందించేందుకు చర్యలు చేపట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్ప సర్పంచ్ అర్లబు సత్యం, వార్డు సభ్యులు పి.త్రినాథ్, హరి పాల్గొన్నారు.

ప్రారంభంకాని పాఠాలు

◆ కెజిబివిలో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులకు లేని అధ్యాపకులు
◆ అయోమయంలో ఇంటర్ విద్యార్థినులు

ప్రజాశక్తి - ఎటపాక

ఎటపాక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) జూనియర్ కళాశాలలో మ్యాథ్స్, ఫిజిక్స్ అధ్యాపకులు లేకపోవడంతో నేటికీ ఈ సబ్జెక్టుల పాఠాలు మొదలుకాలేదు. దీంతో ఇంటర్ విద్యార్థినులు అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. ఎటపాక కెజిబివి స్కూల్‌కు అదనంగా జూనియర్ కాలేజీను మూడు సంవత్సరాల క్రితం మంజూరు చేసి ఎంపిసి గ్రూపును ప్రారంభించారు. ప్రస్తుతం ఇంటర్ ప్రథమ సంవత్సరం 29 మంది, ద్వితీయ సంవత్సరం 37 మంది విద్యార్థినులు ఉన్నారు. జూనియర్ కాలేజీ ప్రారంభమైన తరువాత కాంట్రాక్టు ప్రాతిపదికన అధ్యాపకుల నియామకం జరగ్గా, మరికొంత మందిని అవసరం మేరకు స్థానికంగా నియామకం చేసి బోధనకు ఇబ్బంది లేకుండా చూశారు. అయితే ఈ ఏడాది జిల్లాల విభజన తరువాత కెజిబివిలను ఎస్ఎస్ఎ పిఒల పరిధి నుంచి డిఇఒ పరిధిలోకి ప్రభుత్వం మార్చింది. అంతేకాకుండా స్థానికంగా నియమించుకునే అవకాశం కూడా లేకుండా చేసింది. ఈ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులకు అధ్యాపకులు లేరు. డిఇఒ ద్వారా ఈ రెండు సబ్జెక్టులకు అధ్యాపకుల నియామక ప్రక్రియ కూడా జరగలేదు.

విద్యా సంవత్సరం ప్రారంభమై 6 నెలలు గడుస్తుంది. సంక్రాంతి సెలవులు మినహాయిస్తే ఇక రెండు నెలలు మాత్రమే ఉంటుంది. అలాంటిది నేటికీ అధ్యాపకులను నియమించే దిశగా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థినులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పబ్లిక్ పరీక్షలకు చదువుతూనే, పలు రకాల ప్రవేశ పరీక్షలకు ప్రిపేర్ కావాల్సి ఉంది. ఇంజనీరింగ్‌లో సీట్ సాధించాలన్నా, ఇంటర్‌లో మెరుగైన స్కోర్ పొందాలన్నా మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జక్ట్‌లు చాలా కీలకం. ఇవి నూటికి నూరు శాతం మార్కులు సాధించుకోగలిగే సబ్జెక్టులు. అటువంటి మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జక్ట్‌లకు అధ్యాపకులు లేకపోవడంతో ఏమి చేయాలో తెలియక విద్యార్థినులు అయోమయంలో ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అసలు ఇంటర్ పాస్ అవుతామో లేదో అనే బెంగ వీరిని పట్టుకుంది. కళాశాలలో ఫిజిక్స్ ల్యాబ్ కూడా లేకపోవడంతో ప్రాక్టికల్స్ ఊసే లేదు.

ఇదిగో అధ్యాపకులు వస్తారు, బోధిస్తారు అని చెబుతూ అధికారులు కాలం వెళ్లదీశారంటూ విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠాలు వినకుండా తాము పరీక్షలు ఎలా రాస్తామని వారు ప్రశ్నిస్తున్నారు. పోటీ ప్రపంచంలో ఒక్క మార్కు తక్కువొచ్చినా తాము వెనకపడిపోతామని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఏజెన్సీలో విద్యపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని, డిసెంబర్ చివరి వరకు అధ్యాపకులను నియమించకపోవడం బాధ్యతారాహిత్యమని విద్యార్థినుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఎప్పుడు అధ్యాపకులను నియమిస్తారు? ఎప్పుడు పాఠాలు పూర్తి చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణమే అధ్యాపకుల నియామకం చేపట్టి సిలబస్‌ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

డిఇఒ దృష్టికి తీసుకెళ్లాం

కెజిబివి జూనియర్ కళాశాల అధ్యాపక పోస్టుల ఖాళీలపై ఉన్నతాధికారుల వద్ద సమాచారం ఉంది. సమస్యను డిఇఒ దృష్టికి తీసుకెళ్ళాం. త్వరలోనే పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. స్థానికంగా అధ్యాపకులను నియమించుకునే అవకాశం మాకు లేదు.

-పి.కృష్ణమ్మ, ఎటపాక కెజిబివి ఎస్ఒ



పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని ఆశా వర్కర్లకు పెండింగ్ వేతనాలు, ఇన్సెంటివ్‌లు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పుల్లయ్యకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంలో సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ప్రతిదీ మొబైల్ నుండి అప్‌డేట్ చేయాలని పైఅధికారులు చెబుతున్నారని, కాని ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు సరిగా పని చేయడం లేదని తెలిపారు. సెల్ఫోన్లో ఉన్న యాప్స్ అన్ని డిలీట్ అవడం వలన బాగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన డిప్యూటీ డిఎంహెచ్ఓ మాట్లాడుతూ పై అధికారులతో మాట్లాడి ఈ మొబైల్ యాప్స్ డిలీట్ అవకుండా సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్లో ఉన్న జీతాలు ఇన్సెంటివ్ సమస్యను పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రవ్వ వీరమ్మ, మండల కార్యదర్శి వీరబోయిన దారేశ్వరి, నాయకులు పదం ముత్తమ్మ, సవలం ముత్తమ్మ, శ్యామల లక్ష్మి, నిరోషా, లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



డిప్యూటీ డిఎంహెచ్ఒకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సరోజిని, ఎంపిటిసి విజయలక్ష్మి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ పూనెం సరోజినీ, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ రైతు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం ప్రకటించిన ధర కింటాకు రూ.2040 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, వైసిపి నాయకులు మురళి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని చెరుకుంపాలెం సచివాలయాన్ని ఎంపీడీవో కె బాపన్నదొర శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్లు సక్రమంగా అందేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. ఆయుష్మాన్ భారత్, ఈకేవైసీ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో కలిసి సచివాలయ పరిసరాల్లో పరిశుభ్రం చేశారు. సచివాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా, చెత్తా చెదారం ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ బాపన్న దొర

బాధిత రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ప్రమాదవశాత్తు వరి కుప్పలు దగ్ధమై పంటను నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని అరకు నియోజకవర్గం జనసేన నేత రామదాసు డిమాండ్ చేశారు. శుక్రవారం జనసేన పార్టీ బృందం కొర్ర గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రామదాసు మాట్లాడుతూ, కొర్ర గ్రామంలో ఏడు కుటుంబాలకు సంబంధించిన వరి కుప్పలు ప్రమాదవశాత్తు దగ్ధమైనప్పటికీ సచివాలయం సిబ్బంది నుండి మండల స్థాయి అధికారుల వరకు ఇప్పటివరకు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమైన విషయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర ముత్యాలనాయుడు, చంద్రశేఖర్, కిరణ్, విష్ణువర్ధన్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



ఒంగి పోయిన లారీ

ప్రజాశక్తి-జిమాడుగుల: మండలంలో బోయితిలి పంచాయతీ రాసివీధి గ్రామంలో సిసి రోడ్ నిర్మాణానికి కంకర తీసుకొచ్చిన లారీ గ్రామ సమీపంలో ఒరిగి పోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయో పరిమితి మూడేళ్లు పెంచాలి

ప్రజాశక్తి- మాధవధార : ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయో పరిమితి మూడేళ్లు పాటు సడలింపు ఇవ్వాలని ఎపి స్టేట్ కాంగ్రెస్ ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు కోరారు. పోలీస్ యూనిఫామ్ వేసుకోవాలన్న లక్ష్యంలో కొన్నేళ్లుగా శిక్షణ పొందుతున్న వేలాదిమంది అభ్యర్థులు కొన్నిరోజులు, వారాలు, నెలల తేడాతో వయోపరిమితి కారణంగా ఉద్యోగాలకు అనర్హులుగా మారుతున్నారన్నారు. గతంలో నియామకాల్లో త్రుటిలో ఉద్యోగాన్ని దక్కించుకోలేని అనేకమంది, నాలుగేళ్ల తర్వాత ఇపుడు తాజా రిక్రూట్‌మెంట్‌లో వయస్సుతేడాలో అనర్హులుగా మారారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, హోంమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టి, పోలీస్ నియామకాలకు వయోపరిమితిని అన్ని వర్గాలకు మూడేళ్లు పెంచి న్యాయం చేయాలని కోరారు. తద్వారా వేలాదిమంది పోలీసు ఉద్యోగార్థుల ఆశలకు జీవం పోయాలని కోరారు.

భారీ తాచుపాము హతం

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామంలో పొలంలో సంచరిస్తున్న 10 అడుగుల తాచుపామును రైతులు హతపర్చారు. నల్లల రామకృష్ణ పొలంలో రైతులు వరి కుప్ప వేస్తుండగా, గట్టుపై కనబడిన పాముతో భయంతో మట్టుబెట్టారు.

స్పందన అర్జీల పరిష్కారంపై శ్రద్ధ పెట్టండి

ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: స్పందన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ జెసి జె.శివ శ్రీనివాసు అధికారులకు సూచించారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనుల నుండి 46 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్థికేతర సమస్యలను త్వరితగిన పరిష్కరించాలని సూచించారు. చింతపల్లి మండలం రాజుపాకలు పంచాయతీకి చెందిన గిరిజనులు వంతల సోమ్లు, ఎస్.కనక రత్నం తమకు వంశపారం పర్యంగా సక్రమించిన భూములు వెబ్ ల్యాండ్‌లో వేరొకరి పేరుపై ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. డుంబ్రిగుడ మండలం డుంబ్రిగుడ గ్రామస్తుడు బి.సుబదాన్ రేషన్ కార్డు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కొయ్యూరు మండలం డౌనూరు గ్రామస్తుడు డి.భాస్కరరావు ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరారు. డుంబ్రిగుడ మండలం కొర్రాయి పంచాయతీ బల్లుగుడ గ్రామస్తులు పి.సహదేవ్, కె.నాగరాజు, కె.రాంబాబు తదితరులు మంచినీటి బోరు మరమ్మతుకు గురైందని కొత్తబోరు, సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. జికె.వీధి మండలం మొండిగెడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎ.ప్రియాంక, వార్డుమెంబరు ఎస్.శాంతి నీరుపేట, మామిడిపాలెం గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. కొయ్యూరు మండలం పెదమాకవరం గ్రామ పంచాయతీకి చెందిన డి.శ్రావణి లింటల్ లెవెల్ వరకు ఇల్లు నిర్మాణం చేసిన బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిషేక్, డిఆర్ఒ బి.దయానిధి, ఎపిఒ జనరల్ విఎస్ ప్రభాకరరావు, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఇఇ డివిఆర్‌ఎం రాజు, ఆర్ డబ్ల్యూఎస్ ఇఇ లీలాక్రిష్ణ, డిఎల్ పిఒ పిఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.1

రైతుల సమస్యలను పరిష్కరించకుంటే జగన్ పర్యటనను అడ్డుకుంటాం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 28న నర్సీపట్నంలో సీఎం జగన్ పర్యటనను అడ్డుకుంటామని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఆధ్వర్యంలో నర్సీపట్నంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సిబిఎం కాంపౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలీస్ స్టేషన్, అబీసెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, వైసీపీ రైతు వ్యతిరేక నిర్ణయాలతో అన్నదాతలు ఎన్నడూ లేని విధంగా సంక్షోభంలోకి కూరుకు పోయారన్నారు. పండించే పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. రైతుల బాధను వైయస్. జగన్మోహన్‌రెడ్డికి కనిపించ లేదన్నారు. కళ్లంలో ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదన్నారు. భూములు గుర్తించి దోచుకోవ డానికే భూముల రీ సర్వే చేపడుతున్నారని విమర్శించారు. సీఎం జగన్ ఫొటోలతో పాసు పుస్తకాలు ఇవ్వడం సిగ్గు చేటన్నారు. విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్లో భారీ కుంభకోణం చేశారన్నారు. అనంతర చోడవరం మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయడులు మాట్లాడారు. ఆర్డీవో కార్యాలయంలో ఏఒ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

సంపద తయారీ కేంద్రాన్ని పూర్తి చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లిలో సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి సూచించారు. షెడ్డు నిర్మాణం పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. నిర్మాణం పనుల పై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో నక్కపల్లి, కశింకోట, సబ్బవరంలో ఏర్పాటు చేస్తున్న సంపద తయారీ కేంద్రాలను శిక్షణ కేంద్రాలుగా మార్చి చెత్త నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 8 మండలాలకు సంబంధించి చెత్త నిర్వహణపై ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణపై అవగాహన కోసం విజయవాడలో జరిగే తరగతులకు హాజరుకా వాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు సూచిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎంపిడీవో సీతారామరాజు, ఈఓపిఆర్డి వెంకట నారాయణ, పంచాయతీ ఉపసర్పంచ్ వీసం రాజు పాల్గొన్నారు.

గిరిజనులకు సరుకుల పంపిణీ

పజాశక్తి-కొత్తకోట: క్రిస్మస్ పండగ సందర్భంగా రావికమతం మండలం ధర్మవరం జోష్ మిషన్ క్లినిక్ (ధర్మాసుపత్రి)డైరెక్టర్ కె.వర్గీష్ ఆర్థిక సాయంతో పలువురు గిరిజన నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణి చేశారు. ఈ మేరకు శుక్రవారం ధర్మవరం, సికాయిపాడు, చలిసింగం గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, పప్పులు, ఫారమ్ కోడి తదితర సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్ వర్గీష్ మాట్లాడుతూ, ఏసుక్రీస్తు జన్మదిన వేడుకల సందర్భంగా కొంత మంది నిరు పేదల కైనా సాయం అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం ప్రతిఏటా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడాది కాలంగా తమ జోష్ మిషన్ ఆసుపత్రి ద్వారా పేదలకు వైద్య ఆరోగ్య సేవలు అందిస్తు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్చార్జ్ వాసవి, ధర్మవరం గ్రామ సర్పంచ్ రాజేశ్వరి అప్పారావు, ఉప సర్పంచ్ పల్లా సింహాద్రి, నీలాపు నూకరాజు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

ఐదో రోజుకు రిలే దీక్షలు

గిరిజన, మహిళా సంఘాల మద్దతు



దీక్షలో కూర్చున్న సంఘాల నేతలు

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టాలని, పాడేరు ఐటీడీఏ పీవోను తక్షణమే బదిలీ చేయాలని తదితర డిమాండ్లపై ఐటిడీఏ వద్ద చేపట్టిన నిరాహార దీక్ష శుక్రవారం 5వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మ పృథ్వీరాజ్, మహిళా సంఘం నాయకురాలు లకే రత్నాబాయ్‌లు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఐఏఎస్ అధికారులు ఉంటే గిరిజన ప్రాంతం అభివృద్ధి జరుగుతుదని, గిరిజనుల సమస్యలు పరిష్కారం అవుతుందని భావించామని, దీనికి భిన్నంగా పాడేరు ఐటీడీఏ పీవో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.ఐటీడీఏ పీవోకు గిరిజన సమస్యలు వినే తిరిక, ఓపిక లేదన్నారు.గిరిజన ఉద్యోగులు, గిరిజనులను హేళన చేస్తూ మాట్లాడుతున్నా ఎలాంటి చర్యలు ప్రభుత్వం పీవోపై తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ, కో కన్వీనర్లు మువ్వాళ లక్ష్మణరావు, బత్తిరి నరేష్, కదేలి చంటిబాబు, చిన్నారావు, కంబిడి లతాకుమారి, బి.వరలక్ష్మి, మాణిక్యం, రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పరిశీలిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీ దిగవాకపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను శుక్రవారం సర్పంచ్ సూరిబాబు పరిశీలించారు. అనంతరం ఆయన కాంట్రాక్ట్‌తో మాట్లాడుతూ, నాణ్యత లోపం లేకుండా పనులను పూర్తి చేయాలని తెలిపారు.

కైకాల మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-పాడేరు: ప్రముఖ నటుడు కైకాల సత్యనారాయణ మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు రాష్ట్ర కమిటీ తరపున సంతాపం వెలిబుచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వారు గొప్ప నటుల మృతి సినీ రంగానికి తీరని లోటన్నారు.సిపిఎం విశాఖపట్నం జిల్లా కార్యదర్శి కే.లోకనాథంతో పాటు అల్లూరి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు సంతాపాన్ని ప్రకటించారు.



మాట్లాడుతున్న రంగమ్మ

మహిళలకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-చింతూరు : క్రిస్మస్, సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఎర్రంపేట, కల్లేరు, ఏడుగురాళ్లపల్లి కేంద్రాల వద్ద మహిళలకు ఆటల పోటీలు, రేలా డ్యాన్సులు, సాంస్కృతిక నిర్వహిస్తున్నట్లు ఐద్వా మండల కార్యదర్శి ముర్రం రంగమ్మ తెలిపారు. వీటిల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్రంపేటలో శుక్రవారం జరిగిన ఐద్వా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చి 75 ఏళ్లు పూర్తయినా నేటికీ మహిళలపె దాడులు, అత్యాచారాలు, గృహ హింస, లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సాంఘిక దురాచారాలపైనా, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉండాలని పోరాడుతుందని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకులు పాండు ముత్తమ్మ, కారం అమల, పాండు నాగమ్మ, సాయమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్లను నియమించాలి

ప్రజాశక్తి-చింతూరు : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్లను నియమించాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ ఐటీడీఏ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య ఎక్కువగా ఉన్నా వర్కర్లు తక్కువగా ఉన్నారని, దీంతో వారిపై పని భారం పెరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా ఏ స్కూల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, అక్కడ ఎంతమంది వర్కర్లు ఉండాలి అనేది స్థానికంగా ఉన్న అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, వర్కర్లు పాల్గొన్నారు.

గ్లోబల్ హెల్త్ సమ్మిట్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వచ్చే ఏడాది జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ నిర్వహిస్తున్న గ్లోబల్ హెల్త్ సమ్మిట్ బ్రోచర్‌ను శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్లోబల్ హెల్త్ సమ్మిట్ చైర్మన్, రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ టి.రవిరాజు, సమ్మిట్ కో- చైర్మన్ డాక్టర్ టి.రాధ పాల్గొన్నారు. గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌కు హాజరు కావాలని మంత్రి రజనిని డాక్టర్ రవిరాజు, డాక్టర్ రాధ దంపతులు ఆహ్వానించగా అందుకు మంత్రి అంగీకరించారు.

ఉద్యమాలకు దిక్సూచిగా.. కార్మిక ఐక్యత దిశగా ..

ముగిసిన సిఐటియు విశాఖ జిల్లా 12వ మహాసభ
కార్యదర్శి నివేదికపై సుదీర్ఘ చర్చలు
36 తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉద్యమాలకు దిక్సూచిగా.. కార్మిక ఐక్యత దిశగా.. సిఐటియు విశాఖ జిల్లా 12వ మహాసభ సాగింది. కనీస వేతనాలకు నోచుకోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల హక్కులపై ప్రభుత్వ విధానాల దాడికి వ్యతిరేకంగా కార్మిక ఐక్యతే లక్ష్యంగా.. భవిష్యత్తు పోరాటాలకు దిక్సూచిగా సిఐటియుని మరింత బలోపేతం చేసేందుకు మహాసభలో ప్రతినిధులు రెండు రోజుల పాటు చర్చలు చేశారు. 36 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తొలిరోజు పవేశపెట్టిన నివేదికపై పతినిధులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఆర్‌పి.రాజు నగర (అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం)లో జరిగిన ఈ సభల్లో రెండు రోజుల పాటు జరిగిన సభలు, చర్చల్లో కార్యదర్శి నివేదికపై గోపాలపట్నం జోన్ నుంచి అనసూయ, గాజువాక నుంచి శ్రీను, మల్కాపురం నుంచి సురేష్, అక్కయ్యపాలెం నుంచి యుఎస్ఎన్ రాజు, పెందుర్తి నుంచి శంకరరావు, కంచరపాలెం నుంచి సింహాచలం, మధురవాడ నుంచి కొండమ్మ, ఆరిలోవ నుంచి ఐసి.నాయుడు, మద్దిలపాలెం నుంచి పి.వెంకటరావు జగదాంబ జోన్ నుంచి మీసాల హరి, భీమిలి నుంచి రవ్వ నరసింగరావు, స్టీల్ జోన్ నుంచి అప్పలరాజు, హెచ్‌పిసిఎల్ నుంచి సత్యనారాయణ, హైర్ బస్సు, ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ యూనియన్ నుంచి తులసీరామ్, మిడ్డే మీల్స్ నుంచి రాంబాయి, పెన్షనర్ల అసోసియేషన్ నుంచి సుధాకర్ తదితరులు ప్రజంటేషన్స్ ఇచ్చారు.

రెండో రోజు శుక్రవారం మహాసభలో సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు సౌహార్ద సందేశాన్నిచ్చారు. మోడీ ప్రభుత్వం దేశభక్తి పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతోందని, వీటిని కాపాడే నిజమైన దేశ భక్తులుగా కార్మికులే పోరాటాలు సాగిస్తున్నారని ఉద్ఘాటించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యాక్టరీలు, పార్మా సంస్థల్లో నిరంతరం ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు పోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకులకు పట్టడం లేదన్నారు. బ్రాండిక్స్ ప్రమాదంపై కమిటీ వేసినా నివేదికను ఇంతవరకూ బయటపెట్టకపోవడం.. కార్మికుల ప్రాణాలంటే పాలకులకు లెక్కలేనితనాన్ని సూచిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీస వేతనానికి నోచుకోక లక్షల కార్మిక కుటుంబాలు జీవనం సాగించలేని స్థితిలో నెట్టుకుంటూ వస్తున్నాయన్నారు.

నిరవధిక సమ్మెలకు కార్మికవర్గం సిద్ధం కావాలి : ఆర్‌కెఎస్‌వి.కుమార్

విశాఖ కేంద్రంగా 22, 23 తేదీల్లో జరిగిన సిఐటియు 12వ జిల్లా మహాసభలు రాబోయే మూడేళ్ల పోరాటాలకు దిశానిర్దేశం కానున్నాయని ఆ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ వెల్లడించారు. సమ్మెలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం (ఎవికె)లో సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 వేల మంది కార్మికులకు ప్రాతినిథ్యం వహించేలాగ 300 మందికిపైగా వివిధ కార్మిక రంగాలు, సంఘాల నుంచి ప్రతినిధులు ఈ సభల్లో పాల్గొన్నారని, రెండు రోజుల పాటు వివిధ కార్మిక సమస్యలపై చర్చలు జరిపారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రధానిగా వచ్చాక కార్మిక హక్కులపై తీవ్రంగా దాడి చేస్తున్నారని, లేబర్ కోడ్‌లు తెచ్చి యాజమాన్యాలకు వత్తాసు పలుకుతూ కార్మికులకు నష్టం తెచ్చే విధానాన్ని తీసుకొచ్చారని అన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ స్కీం (ఎన్‌ఎంపిఎస్)ను దేశంపై రుద్దుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నిటినీ ప్రైవేటీకరించారని, జాతీయ రహదారులపై టోల్‌గేట్ ఛార్జీలతో బాదుడు ప్రారంభించారని అన్నారు. ఈ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై పెట్టుబడిదారులు, పరిశ్రమల అధిపతుల దోపిడీకి ఆలవాలంగా మారిందన్నారు. మోడీ దుర్మార్గ విధానాలపై భవిష్యత్తులో ప్రజలు, కార్మికులు నిరవధిక సమ్మెలకు సిద్ధమైనా ఆశ్చర్యం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మిక సమస్యల పరిష్కారం అజెండాతో పార్టీలు రావాలని పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం అన్న సుప్రీం కోర్టు తీర్పును సైతం ఎక్కడా యాజమాన్యాలు అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.4500 నుంచి రూ.11 వేలు వరకూ మాత్రమే చెల్లిస్తున్నారని, ఈ వేతనంతో కుటుంబ పోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. రైతు వ్యతిరేక చట్టాలను మోడీ తీసుకొచ్చినప్పుడు రైతాంగం తిరగబడి వాటిని ఎలాగైతే రద్దు చేయించుకున్నారో లేబర్ కోడ్స్‌పైనా అలాంటి పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. సంఘం రాష్ట్ర మహాసభలు 2023 జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరుగనున్నాయని, ఈలోగా రాష్ట్ర కార్మిక జాతాలు మూడు ప్రాంతాల నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి విశాఖకు ఒక జాతా 28న ఇచ్ఛాపురంలో ప్రారంభమై 29న విశాఖకు వస్తుందన్నారు. దీనికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు సారథ్యం వహిస్తారన్నారు. మిగతా రెండు జాతాల్లో ఒకటి కుప్పం నుంచి భీమవరానికి, మరొకటి హిందూపురం నుంచి భీమవరానికి రానున్నాయన్నారు. వీటికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, ఉమామహేశ్వరరావు సారథ్యం వహిస్తారని తెలిపారు.



మహాసభలో మాట్లాడుతున్న కుమార్

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమం ఉధృతం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, ప్రైవేటీకరణ చేయరాదని అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నామని జెఎసి నాయకులు, స్టీల్‌ప్లాంట్‌లోని హెచ్‌ఎంఎస్ యూనియన్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు తెలిపారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 631వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 27న అన్ని పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బహిరంగ సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం అన్ని పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీ యాత్రకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. దీక్షల్లో పాల్గొన్న వారిలో యూనియన్ ఉపాధ్యక్షులు జి.అప్పలరాజు, గొడ్డు రమణ, జి.సత్యారావు, జి.అప్పలనాయుడు, శ్రీరాములు, ఎన్.లక్ష్మీనారాయణ, వెంకునాయుడు పాల్గొన్నారు.



ఇసుక బస్తాలు తరలిస్తున్న మహిళలు

శరవేగంగా కెనాల్ గండి పూడ్చే పనులు

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్‌కు పడిన గండి పూడ్చివేత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పోల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీరందించే ఈ పవర్ కెనాల్ 3/6 వద్ద ప్రమాదవస్తు ఈ 14న అర్ధరాత్రి గండి పడిన సంగతి తెలిసిందే. గండి పూడ్చి వేయడానికి యంత్ర సామగ్రితో పాటు అవసరమైన సామగ్రిని సమకూర్చారు. రాత్రి, పగలు పనులు నిరంతరం చేసేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. గండి పడిన ప్రదేశంలో లూజ్ మట్టిని తొలగించి ఈ ప్రాంతాన్ని చదును చేశారు. కెనాల్ నుంచి వచ్చిన లీకేజీ వాటర్ పనులకు అవాంతరాలు ఏర్పడకుండా ముందు జాగ్రత్తగా ఇసుక బస్తాలు అమర్చి ఎప్పటికప్పుడు మోటారుతో నీటిని తొలగించేందుకు ఏర్పాటు చేశారు. సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఇంజనీర్లు పర్యవేక్షణలో గండి పూడ్చే పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు.

700 మందికి హెచ్‌బి పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి పిహెచ్‌సి పరిధిలోని స్థానిక గురుకుల బాలికల, జిల్లా పరిషత్ పాఠశాలలో సుమారు 700 మంది విద్యార్థులకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాధికార్లు శ్రీదుర్గా, లిఖిత మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పాఠశాలల్లో 10 సంవత్సరాలు దాటిన బాలబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కోవిడ్ ఫోర్త్ వేవ్ వ్యాప్తి చెందుతున్నట్లు ప్రభుత్వం హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్యవేణి, పి.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది సత్యవతి, రత్నకుమారి, లక్ష్మి, గంగాభవాని, లక్ష్మయ్య, నానిబాబు, నాగవాసు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఏ రాష్ట్రానికి ప్రతిపక్ష నాయకుడో అర్థం కావడం లేదని ఎపి ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రోజుకో ప్రాంతానికి వెళ్లి అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాలలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూస్తున్న జనం చంద్రబాబు నాయుడు చెప్పే మాటలను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. టిడిపి నేతలు కూడా చంద్రబాబు నాయకత్వాన్ని విశ్వసించడం లేదని అన్నారు. దీంతో అయోమయంలో పడ్డ చంద్రబాబు నాయుడు బిజెపితో సహా పలు పార్టీలను కలుపుకుపోవడానికి, వారిని నమ్మించేందుకు తన నటనా చతుర్యాన్ని ప్రదర్శిస్తున్నారని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. మతిస్థిమితం లేని నాయకుని వెంట ఉన్న వారిని కూడా పిచ్చి వాళ్లనే అనాల్సి ఉంటుందన్నారు. కొద్దిరోజుల కిందట హైదరాబాదులోని ఎన్‌టిఆర్ భవన్‌కి బూజులు దులిపి తాను తెలంగాణలోనే ఉంటున్నానని, తెలుగుదేశానికి పుట్టినిల్లు తెలంగాణయే అని చంద్రబాబు నాయుడు చెప్పడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలని అమర్‌నాథ్ ప్రశ్నించారు. చంద్రబాబు ఖమ్మం వెళ్లి ఇది నా గుమ్మం అంటాడు.. మరి కుప్పం ఏమిటని అడిగారు. ఉత్తరాంధ్రకు ఏమాత్రమూ మేలు చేయని చంద్రబాబుకు ఈ ప్రాంతంలో అడుగుపెట్టే హక్కు లేదని అమర్‌నాథ్ అన్నారు. దేశంలోనే పేరెన్నికగన్న విశాఖ నగరాన్ని పరిపాలనా రాజధానిగా చేయాలని అసెంబ్లీలో తీర్మానించి ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తున్నామని తెలిపారు.